
40వ డివిజన్‌కు మహర్దశ

- రూ. 24.15 కోట్లతో మౌలిక వసతులు
- డీబీటీ ద్వారా రూ. 37.73 కోట్లు
- నాన్ డీబీటీ ద్వారా రూ. 11.12 కోట్లు



విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 40 వ డివిజన్‌కు మహర్దశ పట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ రూపు రేఖలు మారాయి. రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టులు, వాటర్ పైపు లైన్లు, తాగునీటి అవసరాలకు వాటర్ ట్యాంక్ ఇలా మౌలిక వసతులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రూ. 24.15 కోట్లతో సీసీరోడ్లు, బీటీ రోడ్లు నిర్మించారు. తాగునీటి పైపు లైన్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే చేరాయి. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం ద్వారా రూ.37.73 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా రూ. 11.12 కోట్లు అందాయి. ఇంత స్థాయిలో అభివృద్ధి, సంక్షేమం గతంలో ఎన్నడూ జరగలేదు. డివిజన్‌లోని బాల భాస్కర్, అల్లుడు పేట వంటి ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు ధ్వంసమయ్యాయి. చినుకు పడితే ఆ ప్రాంతంలో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ ప్రభుత్వంలో రోడ్ల ఎత్తు పెంచి నూతనంగా సీసీ రోడ్లు నిర్మించారు. 38,40, 41 డివిజన్లలోని పలు ప్రాంతాలకు తాగునీటిని అందించడానికి వాటర్ ట్యాంక్ నిర్మించింది. ఇక డివిజన్‌లో ప్రధానమైన ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డును డస్ట్ ఫ్రీ రోడ్డుగా మార్చి బీటీ వేశారు. ఆ రోడ్డు అద్దంలా మెరిసిపోతోంది.

ఇది కదా.. అభివృద్ధి

కొత్త రూపు సంతరించుకున్న రోడ్లు

డివిజన్‌లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి అక్షరాల రూ. 5.76 కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. జాతీయ రహదారి నుంచి మానవమందిరం రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం, అల్లుడు పేట ప్రధాన రహదారి, దుర్గామల్లేశ్వరరావు కాలనీ రోడ్డు, స్వాతి థియేటర్ వెనుక రోడ్డు, కోళ్ల ఫారం క్రాస్ రోడ్డు, మానవ మందిరం రోడ్డు నుంచి గాంధీ బొమ్మ రోడ్డు, చర్చి రోడ్డు , డాల్ఫిన్ బార్ రోడ్డు, అమృత అపార్ట్‌మెంట్ రోడ్డు, ఎమ్మార్వో ఆఫీస్ క్రాస్, బాల భాస్కర్ నగర్ క్రాస్‌రోడ్డు, క్రాంబే రోడ్డు , హనుమయ్య వీధి ప్రాంతాల్లో రోడ్లు కొత్త రూపు సంతరించుకున్నాయి.

- రూ. 10.65 కోట్లతో వాటర్ ట్యాంక్, వాటర్ పైపులైన్లు, హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి లారీ స్టాండ్ వరకు మెయిన్ పంపింగ్, హౌసింగ్ బోర్డు కాలనీలో, డివిజన్‌లోని పలు ప్రాంతాలకు వాటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు.
- రూ. 7.73 కోట్లతో డ్రెయిన్లు, కల్వర్టులు, సీసీ ప్యాచ్ వర్కులు పూర్తయ్యాయి.



లారీ స్టాండ్ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్

నాన్ డీబీటీ ద్వారా

పథకం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
ఇంటి స్థలాలు	63	1,54,98,000
జగనన్న విద్యా కానుక	301	40,25,645
బైజూస్ ట్యాబ్స్	106	24,37,328
జగనన్న తోడు	66	24,05,898
జగనన్న గోరు ముద్ద	277	13,30,673
వైఎస్సార్‌సంపూర్ణ పోషణ	632	1,15,50,633
వైఎస్సార్‌కంటివెలుగు	-	-
ఇంటింటికీ రేషన్	3,387	7,40,29,316
మొత్తం		11,12,77,493

ప్రత్యక్ష నగదు బదిలీ పథకం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
జగనన్న అమ్మ ఒడి	1,458	5,29,94,444
జగనన్న విద్యా దీవెన	861	4,11,15,861
జగనన్న వసతి దీవెన	669	1,07,06,034
జగనన్న విదేశీ విద్యా దీవెన	-	-
వైఎస్సార్ రైతు భరోసా	920	4,22,42,450
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	205	75,76,778
సున్నావడ్డీ పంట రుణాలు	112	3,41,360
రైతులకు ఇన్ పుట్‌సబ్సిడీ	150	11,55,345
మత్స్యకార భరోసా	3	40,000
వైఎస్సార్‌పెన్షన్ కానుక	1,310	11,43,20,500
వైఎస్సార్ చేయూత	409	1,72,12,500
వైఎస్సార్ ఆసరా	1,406	4,52,26,775
వైఎస్సార్ సున్నావడ్డీ	1,674	50,79,476
వైఎస్సార్‌కాపు నేస్తం	67	25,24,322
ఈబీసీ నేస్తం	296	79,20,000
వైఎస్సార్ కల్యాణమస్తు	-	-
వైఎస్సార్‌ఆరోగ్య శ్రీ	382	1,47,56,791
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	166	20,59,446
హౌసింగ్	26	13,68,026
వైఎస్సార్ బీమా	24	16,15,108
వైఎస్సార్‌వాహనమిత్ర	192	46,96,092
వైఎస్సార్ నేతన్న నేస్తం	-	-
జగనన్న చేదోడు	86	16,20,000
కోవిడ్ సాయం	2672	26,72,000
జగనన్న తోడు (వడ్డీ)	34	1,46,428
మొత్తం		37,73,89,736

అభివృద్ధికి రోడ్లే సాక్ష్యం



ఈ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధికి జరిగింది. ఇందుకు మా డివిజన్‌లో రోడ్లే సాక్ష్యం. గతంలో ఎప్పుడో వేసిన బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇప్పు సీసీ రోడ్లు వేశారు. విస్తరించారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పడింది. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.
–రేగులగుంట రమణయ్య, స్థానికుడు

సమస్యలకు శాశ్వత పరిష్కారం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయి. డివిజన్ ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. చక్కగా రోడ్లు వేశాం. మారుమూల రోడ్లను అభివృద్ధి చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువే చేశాం. బాల భాస్కర్ నగర్, అల్లుడు పేట వాసుల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. కృష్ణానది వెంటరూ.8 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. –యరడ్ల ఆంజనేయరెడ్డి, కార్పొరేటర్

సాయపడే గుణం అలవర్చుకోవాలి

ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేవుడు మనకు ఉపదేశించినట్లుగా మానవులందరూ తోటివారికి సాయపడే గుణాన్ని అలవరచుకోవాలని జోజినగర్ విచారణ గురువులు ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప పేర్కొన్నారు. మట్టల (మ్రాని కొమ్మల) ఆదివారం పురస్కరించుకుని భవానీపురంలోని అద్భుత బాల ఏసు పుణ్యక్షేత్రంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పుర వీధుల్లో మట్టలను పట్టుకుని బాలఏసు చర్చి నుంచి గొల్లపూడి బైపాస్ రోడ్డు మీదుగా కరెంట్ ఆఫీస్ వరకు, అక్కడి నుంచి తిరిగి చర్చి వద్దకు ఊరేగింపు సాగింది. అనంతరం చర్చిలో విచారణ గురువులతో సమష్టి దివ్య బలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప మాట్లాడుతూ ఏసుక్రీస్తు మన అందరి పాపాల పరిహారానికి శిలువ మరణాన్ని ఆనందంగా స్వీకరించారని, ఈ ఉపవాస దినాల్లో నాటి సంఘటనను గుర్తు తెచ్చుకుని ఒకరికొకరు అన్నట్లుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ రాజేష్, ఫాదర్ సుధాకర్, సిస్టర్స్ కౌన్సిల్ మెంబర్స్, సంఘస్తులు పాల్గొన్నారు.

వించిపేట(విజయవాడపశ్చిమ): ఫ్రైజర్‌పేటలోని తెలుగుబాప్టిస్ట్ చర్చి సండే స్కూల్ ఆధ్వర్యాన పవిత్ర 'మట్టల ఆదివారం' పండుగను క్రైస్తవ విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చి సంఘ కాపరి నిక్సన్ అండ్రూస్ సంఘ పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించారు. యెరుసలేం దేవాలయంలోకి ఏసుక్రీస్తు ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని దేవున్ని స్తుతిస్తూ ఆనందోత్సవాలతో చిన్నారులు, విశ్వాసులు గానాలు చేస్తు రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన ఈత మట్టలతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు ఇమ్మాన్యేల్, మోజేష్, ఎలియబాబు, సండే స్కూల్ సూపర్‌వైజర్ బూదాల భారతి, విక్టర్ జోషఫ్, కె.కిషోర్, అనుష నిక్సాన్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం: విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని షాలేము మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. మట్టలను చేతబూని బయలుదేరిన ఊరేగింపు స్థానిక కుమ్మరిపాలెం సెంటర్, పున్నమిఘాట్, నాలుగు స్తంభాల సెంటర్ మీదుగా తిరిగి చర్చి వద్దకు చేరుకుంది. చర్చి పాస్టర్ రెవరెండ్ పుట్ల సత్యవేదం , పుట్ల క్షమాబాయి, రవికుమార్, మణిబాబు, సాల్మన్‌రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుణదల (విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు లోకానికి వెలుగని, ఆయన ద్వారానే మానవాళికి పాప క్షమాపణ లభించిందని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. గుణదల పుణ్యక్షేత్రంలో మానికొమ్మల ఆదివారం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజాబలి కార్యక్రమంలో ఫాదర్ జయరాజ్ భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. పుణ్యక్షేత్ర గురువులు, భక్తులు మ్రాని కొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర గురువులు గాబ్రియేల్, సునీల్ రాజు, తదితరులు హాజరయ్యారు.



మట్టల ఆదివారం ఊరేగింపులో విచారణ గురువులు చిన్నప్ప, తదితరులు



షాలేము చర్చి ఊరేగింపులో పాస్టర్ సత్యవేదం తదితరులు



పూలతో అలంకరించిన ఈత మట్టలతో చిన్నారుల ర్యాలీ



సమష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తున్న గురువులు

ప్రభుత్వ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నను రానున్న ఎన్నికల్లో గెలిపించుకుని మళ్లీ ఆయన నాయకత్వంలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మహిళల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను గమనిస్తే ఎవరు మహిళాభివృద్ధికి కృషి చేశారో అర్థమవుతుందని పేర్కొన్నారు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు బ్యాంక్ రుణాలను కట్టవద్దని, తాను అధికారంలోకి వస్తే మాఫీ చేస్తానని వారిని మభ్యపెట్టి గత ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరుతో కొద్ది మందికి మాత్రమే ఇచ్చి మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వంలో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలకు వడ్డీ చెల్లించి ఆదుకున్న మంచి మనసున్న సీఎం జగనన్న అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారని తెలిపారు. మహిళలకు సముచిత స్థానం కల్పించేలా నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ వర్కులలో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన వ్యక్తి సీఎం జగనన్న అన్నారు. షేక్ ఆసిఫ్ కుమార్తె షేక్ రేష్మ మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీమూర్తి ఔన్నత్యాన్ని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళా శక్తిని గుర్తించిన సీఎం జగనన్నకు ప్రతి మహిళా రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, పలువురు మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి, చిత్రం ఆసిఫ్, చైతన్యరెడ్డి, రేష్మ

వయోవృద్ధ సేవలు అభినందనీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద వయోవృద్ధులను గుర్తించి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని ఆర్థోపెడిక్ ఎ.సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సంఘ్వీ నరేంద్రకుమార్ ఒత్మాల్‌జీ ఛాజెడ్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. గైనకాలజిస్టు డాక్టర్ కేఎల్ సౌజన్, బీ సుజాత, ట్రస్టు సభ్యులతో కలిసి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు వారికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, తట్టి అర్జునరావు మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లక్ష్మీనరసింహారావు, వెంకటేష్, గోదావరి, వయోవృద్ధులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం

షేక్ ఆసిఫ్


భవానీపురం(విజయవాడపశ్చిమ): బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని వారికి వివిధ పదవులు ఇచ్చి చట్ట సభల్లో స్థానం కల్పించి రుజువు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్‌కు ఇటీవల నియమితులైన నూతన కమిటీ జనరల్ సెక్రటరీ మాగం ఆత్మారాము, కార్యదర్శులు గొలగాని శ్రీనివాసరావు, పాశం శివ, జాయింట్ సెక్రటరీలు చల్లా సుబ్రహ్మణ్యం, మల్లాది శివ, విజయవాడ నగర బీసీ సెల్ అధ్యక్షుడు బోను రాజేష్ కుమార్‌లు విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో షేక్ ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు ఆసిఫ్. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి శ్రీనివాస్, పార్టీ నాయకులు మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.



బీసీ సెల్ నూతన కమిటీ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫ్

క్రీడలు జీవితంలో భాగం కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం రోడ్డులో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ క్రికెట్ అకాడమీని మణిపాల్ హాస్పటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి సమీపంలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగస్తులు, క్రికెట్ ప్రేమికులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. నిత్యం వ్యాయామం చేయటం, ఆటలతో విద్యార్థులు శారీరకంగా ధృడంగా ఉండటమే కాకుండా మానసికంగాకూడా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. క్రీడలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అకాడమికి శిక్షకులుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియ విశ్రాంత శిక్షకులు ప్రదీప్ కుమార్, మహిళా శిక్షకురాలిగా మౌనిక వెంకట దుర్గ వ్యవహరిస్తారని చెప్పారు. ఈ శిక్షణ తరగతులు వారంలో మంగళవారం నుంచి ఆదివారం వరకు ఉంటాయని తెలిపారు. ప్రాథమిక శిక్షణలో బౌలింగ్, బ్యాటింగ్, వికెట్ కీపింగ్, రన్నింగ్‌తోపాటు ఫిట్నెస్‌కూడా ఉంటుందని వివరించారు.



క్లుప్తంగా

మైనార్టీల పక్షపాతి సీఎం జగనన్న



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతిగా నిలిచారని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ సమీనా ఫాతిమా అన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్‌మీరాను ఆమె ఆదివారం గొల్లపూడిలో సత్కరించారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ కాలేషా, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్, సభ్యులు షేక్ సోహబ్, మహిళా అధ్యక్షురాలు షేక్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి



విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ఆంధ్రఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నెల వారీ సాంస్కృతిక కార్యక్రమాలు, మనస్సాక్షి సాంఘిక నాటక ప్రదర్శన, మేకప్‌మెన్ గణపతికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. డోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ద్వారా విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ తెలుగు నేల కళా సాంస్కృతిక రంగాలకు ప్రసిద్ధి చెందిదన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి నందివాడ నాని, హనుమంతరాయ గ్రంథాలయ కార్యదర్శి నీలం దుర్గారావు, సినీ, రంగస్థల నటుడు అనంత హృదయరాజ్, బోడి ఆంజనేయ రాజు, బుర్రా నవీన్, సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ పాల్గొన్నారు. మేకప్ మెన్ గణపతిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. హర్షక్రియేషన్స్ విజయవాడ వారి మనస్సాక్షి సాంఘిక నాటికను ప్రదర్శించారు.

కనులపండువగా వెంకన్నకు గరుడసేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గరుడ సేవ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేశారు. పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు. స్వామివారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్ నిర్వహించగా ఆలయ ఈవో ఘంటసాల శ్రీనివాసు పర్యవేక్షించారు.

వాసవి సంస్థలు సేవలను విస్తృతం చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి సంస్థలు సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ సంస్థ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. వాసవి ఇంటర్నేషనల్ మొదటి కేబినెట్ మీటింగ్ పాతబస్తీలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హజరతయ్యగుప్తా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు వాసవి సంస్థలు చక్కని సేవలందిస్తున్నాయన్నారు. రానున్న కాలంలో మంచి ప్రణాళికతో వాసవి సంస్థలు ముందుకు దూసుకుపోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన వాసవి గవర్నర్ కొత్త గణేష్‌బాబు మాట్లాడుతూ వాసవి సంస్థలు అందిస్తున్న సేవలను సభకు వివరించారు. వాసవి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పాలకుర్తి గాయత్రి, మామిడి శ్రీనివాసరావు, ఎంవీఎస్ రామచంద్రరావు, తాతా రజనీకుమారి, శనగపల్లి సురేష్, చిట్టూరి శ్రీనివాసరావు, అన్నం సాయి సునీత తదితరులు పాల్గొన్నారు.

భవానీపురంలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో కేశినేని శ్రీనివాస్, షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం మస్జీద్- ఈ - రజాలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)తో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆసిఫ్, కేశినేని ముస్లిం సోదరులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు అబ్దుల్ అర్షద్, పడిగపాటి చైతన్య రెడ్డి, యరడ్ల ఆంజనేయ రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా, షేక్ అమానుల్లా, ఎండీ మొహిద్దీన్, కో–ఆప్షన్ సభ్యులు అలీమ్, జీఎంసీ బాషా, మస్జిద్ రజా కమిటీ షేక్ కలీమ్,షేక్ బుజ్జు,షేక్ సాదిక్, బడే ఖాన్, షబ్బీర్, ఫారుక్ అహ్మద్, అబ్దుల్ రఫీ, బాజీ బాబా, బషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో క్షయపై అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ కె.యుగంధర్ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్సపై ఉద్యోగులు, రోగులకు వివరించారు. క్షయపై పూర్తి అవగాహన తీసుకువచ్చేందుకు ఏటా ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇది అంటువ్యాధిఅని, నోటి తుంపర్ల ద్వారా సులభంగా అన్ని వయసుల వారికి వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దగ్గేటప్పుడు నోటికి అడ్డుపెట్టుకుంటే చాలవరకు వ్యాధిని నివారించవచ్చన్నారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్ మాట్లాడుతూ ఆరోగ్యకర ఆహార అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన నిద్ర రోగనిరోధక శక్తిని పెంచి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ఆర్టీసీ వర్కు షాపు రోడ్డుకు చెందిన చెన్ను చెన్నకేశవరావు శనివారం ఉదయం పని మీద ఎర్రకట్ట వైపు వెళ్తుండగా, పాలప్రాజెక్టు వైపు నుంచి కొత్తపేటకు వెళ్తున్న ద్విచక్ర వాహనం చెన్నకేశవరావు బైక్‌ను ఢీ కొట్టగా అతను కింద పడ్డాడు. ఇంతలో తేరుకుని పైకి లేస్తుండగా, తనను ఢీ కొట్టిన వాహనం ఐరన్ పార్టు మోకాలికి తగలడంతో తీవ్ర గాయమైంది. బాధితుడిని భవానీపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.